





# దేవత

కిడ్సు వరల్డు పార్కులో ఓ బెంచిమీద కూర్చున్న రాధ దగ్గరికి గోపీ బాధగా - బరువుగా వచ్చాడు. అతని కంటికి ఆమె ఓ దేవతలా కనిపిస్తున్నది.

దగ్గాడు - సకిలించాడు. ఆమె ఎటో చూస్తున్నది రతీ దేవిలాగా.

" ఎక్స్యూజ్‌మీ -" ఆమె ముందు నిలిచి అడిగాడు ఆమె అందానికి దాసుడవుతూ.

రాధ తలెత్తి విసుగ్గా చూసింది.

" ఇక్కడ కూర్చోవచ్చా ?" అడిగాడు తడబడుతూ.

" ఇక్కడే ఎందుకు కూర్చోవాలి. అక్కడ బెంచీలు ఖాళీగా వున్నాయిగా?" రాధ గబుక్కున అడిగింది. కొంచెం దూరంలో వున్న బెంచీలను చూపిస్తూ.

గోపీ తడబడ్డాడు. ఏం సమాధానం చెప్పాలో అర్థం కాలేదు.

" అదే - మీ కభ్యంతరం లేకపోతే..." నసిగాడు.

" కూర్చోండి. నేనే అక్కడికి పోయి కూర్చుంటాను." రాధ లేవబోయింది.

" నో ! నో ! మీరు కూర్చోండి... నా కోసం మీరు లేవద్దు. నేను భరించలేను... సారీ... మిమ్మల్ని డిస్టర్బ్ చేశాను" చెప్పాడు కొంచెం ఎడంగా కూర్చుంటూ - దేవత సన్నిధి ఆనందాన్ని అనుభవిస్తూ.

" అన్నీ మీరే మాట్లాడుతున్నారు" చిరుకోపంతో అంది.

" మీ పేరు తెలుసుకోవచ్చా?" సంకోచిస్తూ అడిగాడు.

" నా పేరుతో మీ కేం పని?" కోపంగా అడిగింది రాధ.

" అఫ్‌కోర్సు ! అంత పనేం లేదు. ఇంత అందంగా ఉన్నవారికి ఖచ్చితంగా అందమైన పేరే ఉంటుందని నా నమ్మకం!" గోపీ చెప్పాడు.

" మీ పేరు బాగాలేదా?" రాధ అంది అతను బాగోలేడన్నట్టు.

" అయ్యో నన్ను గోపీ అంటారు - అట్లాని ఎవరికీ నేను టోపీలు పెట్టలేదు. తాపీగా స్నేహం చెయ్యడమే ఈ గోపికి అలవాటు." చెప్పాడు సిగ్గుపడుతూ హ్యాపీగా.

" మీకు కాఫీ బాగా అలవాటు లాగుంది గోపిగారూ!" రాధ అడిగింది.

" అరె మీకెలా తెలుసు?!" ఆశ్చర్యంగా అడిగాడు గోపి.

" దీనికి పెద్ద ఇంటెలిజెన్సు అక్కరలేదు- మీ తెల్లటి చొక్కామీద కాఫీ మరక కనిపిస్తుంటేనూ అడిగాను" రాధ.

" యు ఆర్ ఏ జీనియస్. ఇది ఇందాక తాగుతున్నప్పుడు కొంచెం కాఫీ ఒలికింది షర్టుపైన. మీరేమీ అనుకోకపోతే ఐస్క్రీము తిందామంటారా?" గోపీ అడిగాడు.

" మీరు తినడానికి నా పర్మిషన్ ఎందుకు? కానివ్వండి."

" అయ్యో ! నా గురించి కాదు నేను అడిగేది. మీ గురించి - మీరు కంపెనీ యిస్తానంటే లాగిస్తాను." గోపీ అడిగాడు దీనంగా.

" సారీ ! ముక్కూ మొహం తెలియని వాడితో నేనేమీ తీసుకోను."

" అయ్యో ! నా మొహం చూశారు - ముక్కు చూశారు. పేరు గోపీ అని తెలుసుకున్నారు. ఇంకా ఏంటి సందేహం?" అనుమానంగా అడిగాడు.

" కొత్తగా వచ్చిన వాళ్ళను నమ్మకూడదని మా బామ్మ చెప్పింది." రాధ చెప్పింది చురుక్కుమనేట్లు - అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరం మేలని.

" అదా మీ అనుమానం-నేను వచ్చి చాలా సేపయింది... పిల్లలు ఆడుకుంటూ ఉంటే చూస్తూ కూర్చున్నాను. బోరుకొట్టి యిలా వచ్చాను" చెప్పాడు గోపి, భుజాలు తడుముకుంటూ.

" అంటే నేను కాలక్షేపపు బఠాణీనా మీ దృష్టిలో ?" కోపంగా అంది.

" నో! నో! అలా అనలేదు. మీరు ఒంటరిగా ఉన్నారు. నేనూ ఒంటరిగా ఉన్నాను. జంటగా మాట్లాడుకుంటే కాలం వెంట పరుగెత్తగలమని నా తంటా!" చెప్పాడు గోపి ప్రాసకోసం ప్రయాసపడుతూ.

" మీ అమ్మ మీకు వస ఎక్కువ పోసినట్లుంది. అపరిచిత వ్యక్తులతో కూడ నస పెట్టగలరు" చెప్పింది రాధ.

" నా బాధ అది కాదు మిస్సు -" తడుముకున్నాడు.

" రాధ ! ఇంక మీరు దయచెయ్యచ్చు-" నిష్కర్షగా చెప్పింది.

" రాధా జీ ! మీరు అలా బాధపెట్టద్దు- నేనేం అవారాని కాదు. బ్యాంకు క్లర్కును" చెప్పాడు గర్వంగా ఫోజుపెట్టి.

" నేను అడగలేదే!" రాధ ఆశ్చర్యం.

" కాని చెప్పాల్సిన బాధ్యత నాపైన ఉంది. ఓ జాతీయ బ్యాంకులో క్లర్కును - దేవుడు దయతలిస్తే ఈ సంవత్సరం ఆఫీసరును కావచ్చు- కాని నాకు ఒకటే లోటు." చెప్పాడు.

" ఏంటో అది!" అడక్కుండా వుండలేకపోయింది రాధ.

" నాకు భార్య లేదు." విచారంగా చెప్పాడు గోపి

" భార్యా ! ఎక్కడికి పోయింది?" కుతూహలంగా అడిగింది.

" నాకు భార్య లేదు!" అతను రెట్టించాడు.

" అదే ఏమైంది?" రెట్టించింది.

" అయ్యో ! అసలు నాకు పెళ్ళి కాలేదు!" తలొంచుకుని చెప్పాడు.

" అరే ! పెళ్ళికాకుండా భార్య ఎలా వస్తుంది?" ఆశ్చర్యంగా అడిగింది.

" అందుకే లేదు. - ఎద్దులా పెరిగినా - ముద్దుగా ఒక్క మొద్దు పెళ్ళాం కూడా నాకు లేదు." గోపి వాపోయాడు గుండెని నొక్కుకుంటూ.

" చాలా దురదృష్టవంతులు!" రాధ సానుభూతి చూపింది.

" చూడండి - ఈ ఊళ్ళో యిన్ని లక్షల మంది ఉన్నారు కదా ! ఒక్కరంటే ఒక్కరు నాకు పెళ్ళాంగా దొరకలేదు." వాపోయాడు.

" గోపీ గారు పెళ్ళాలు ఎక్కడా దొరకరు ! మనమే దొరకపుచ్చుకోవాలి! వాళ్ళు కుప్పలుగా రోడ్డులమీద పోసి ఉండరు" నవ్వు ఆపుకుంటూ చెప్పింది రాధ కొంటెగా.

" నవ్వండి - నవ్వండి - నా బాధ మీకెలా అర్థమవుతుంది రాధా ! వయసు రోజు రోజుకు పరుగు పెడుతున్నది... నచ్చినమ్మాయి ఒక్కతీ నన్ను పెళ్ళి చేసుకోవడం లేదు- అదేం ఖర్మో నన్ను చూస్తేనే పారిపోతున్నారు."

" ఓహో ! మీకు చాలా చరిత్ర ఉన్నట్లుంది చూడబోతే !"

" చరిత్ర అడగద్దు - చెప్పింది వినండి - నాకు చూసేవాళ్ళు లేరు - మా పెద్దవాళ్ళ దృష్టిలో నేను పసివాణ్ణి - ఇంకా పెళ్ళీడు రాలేదుట! నా అంతట నేను సంబంధాలు చూడలేను కదా - తల్లి దండ్రులు బ్రతికి ఉన్నప్పుడు!" చెప్పాడు సిగ్గుపడుతూ.

" పాపం - ఎంత కష్టమొచ్చింది?" నవ్వాపుకుంది బాగుండదని.

" ఎవరన్నా పిల్లనిస్తామని వచ్చినా కాని - ఏదో ఒక వంక పెట్టి చెడగొడతారు- శాఖ కలవలేదంటారు- గోత్రం ఒకటేనంటారు - లేదా జాతకం కుదరలేదంటారు. అన్నీ బాగుంటే వైటమిన్ యమ్ సరి పోలేదంటారు." చెప్పుకొచ్చాడు తన కష్టాల్ని.

" యమ్మా ! అంటే ఏంటమ్మా?" ఆశ్చర్యంగా అడిగింది.

" అదేనండి - కట్నం - నాకు మటుకు అవేమీ అక్కరలేదు. కాని వాళ్ళకు కావాలి! నా చదువు కోసం ఇంత ఖర్చుపెట్టామని వచ్చిన వాళ్ళ దగ్గర చదువుతారు- మీరు చెప్పండి ఎవరి పిల్లలు వాళ్ళకు బరువా? ఏ తల్లిదండ్రులయినా పిల్లలకు చదువు చెప్పించరా? దాన్ని వ్యాపారం చేస్తారా రాధగారూ !" బాధగా అడిగాడు.

" తప్పు ! అస్సలు కట్నం అడిగేవాళ్ళను చట్టానికి పట్టివ్వాలి ! వరకట్నం నిషేధం గదా!" జేవురించిన మొహంతో చెప్పింది దేవత.

" ఇన్ని కష్టాల్లో ఉన్నాను- ఇంక నా మొహాన పెళ్ళి రాత ఉందంటారా? ఆ బ్రహ్మదేవుడు మర్చిపోయాడంటారా? ఆఫ్టరాల్ ఒక్క పెళ్ళన్నా రాశాడో లేదో? కనీసం నా బ్రతుక్కి ఒక్క

పెళ్ళామన్నా ఉందో లేదో? చెప్పండి" బ్రతిమలాడాడు.

" సారీ ! నేను జ్యోతిష్కురాలిని కాదు – వస్తా " – రాధ చకచక వెళ్ళిపోయింది పిల్లలు ఎదురు రావడంతో.

గోపీ నిస్సహాయంగా ఆమెని – ఆమె వెంట వెళుతున్న చిన్నపిల్లల్ని చూస్తూ ఉండిపోయాడు. దేవత అదృశ్యమైపోయింది.

ఓ పది రోజుల తర్వాత సినిమా చూస్తున్న గోపి పక్కన ఎవరో అమ్మాయి కూర్చుంటే ఉలిక్కిపడి చూశాడు – రాధ ఆమె ! ఆడగాలి !

" హల్లో ! మీరు రాధ కదూ !" అనుమాన నివృత్తికోసం అడిగేశాడు.

" ఐసీ మీరు గోపీనా ! సిన్మా చూడండి !" ఒదిగి కూర్చుంది సిన్మా చూస్తూ.

ఇంటర్వెల్‌లో చూసాడు – ఆమె పక్కన ఓ ముగ్గురు పిల్లలు కూర్చుని ఉన్నారు. నవ్వాడు – ఆమె తల పక్కకు తిప్పుకుంది.

బయటకు పోయి ఓ మూడు కూల్‌డ్రింకులు – ఓ ఆరు సమోసాలు పట్టుకువచ్చాడు. " ప్లీజ్ ! తీసుకోండి–" రాధకు అందించబోయాడు.

" అరే ! ఇవన్నీ ఏంటి! ఎవరు తెమ్మన్నారు?" కోపంగా అడగింది.

" అబ్బే ! నేనే తెచ్చాను– తీసుకోండి" రాధకు అందించబోయాడు.

" మాకొద్దు – వాపసు యివ్వండి..." ఖచ్చితంగా చెప్పింది.

" పోనీ పిల్లలకన్నా ఇవ్వండి..." బిక్కమొహం పెట్టి అడిగాడు.

ఆ మాట అనగానే పిల్లలు చేతులు చాచారు. – ఇంక రాధ అడ్డు చెప్పలేక పోయింది. తను వాళ్ళ నోరు ఎందుకు కొట్టాలి పాపం!

మళ్ళీ బయటకు పోయి నాలుగు సమోసాలు, రెండు కూల్‌డ్రింకులు తీసుకు వచ్చాడు ధైర్యం చేసి గోపి.

" ప్లీజ్ ! తీసుకోండి !!" రాధకిచ్చాడు ఒక బాటిలు – రెండు సమోసాలు. ఇచ్చేటప్పుడు కావాలని చెయ్యి తగిలించాడు గోపి.

కొరకొర చూస్తూ తీసుకుంది రాధ.

" మీరు ఛారిటీ చక్రవర్తుల్లాగున్నారు!" దెప్పిపొడిచింది.

"అబ్బే ! కొంచెం దాహం వేస్తేను –" నసిగాడు.

రాధ సీటుమారి ఓ పిల్లాడిని అతని పక్కన కూర్చోబెట్టింది.

సినిమా అయిపోయింతర్వాత బయటపడ్డారు అందరూ.

" రాధగారూ – ఎటు పోవాలి!" గుబులుగా అడిగాడు గోపి.

" ఏట్లోకి – మీ దోవన మీరు పోండి !" చికాకు పడుతూ చెప్పింది.


బెంగుళూరులో సంపాదనలు ఎక్కువంట!
అక్కడకెళ్ళి దోచుకో! భాషరాదని దిగులు
ఎందుకూ!! దోచుకోవడానికి భాషతో..
ఏంపని!!
-AVM


ఇహ లేచి, అంట్లుతోమి
బట్టలుతకండి. ఓట్ల
కోసం అందరిళ్ళల్లో
చేశారుగా!!?
AVM


మీరు ఎందరికో అవకాశం ఇచ్చారు..
దోచుకోవడానికి! నాకూ
ఒక్క అవకాశం ఇవ్వండి!
మీ ఓటు నాకే
-AVM


దిన, వార, మాస పత్రికలన్నీ మీ చేత
కొనిపించడం ఎందుకంటే!? మీరు నాకు
పాకెట్ మనీ ఇవ్వరుగా! ఇవన్నీ తూకానికి వేస్తా!
-AVM

" ఎందుకండి అంత కోపం - నాకు బండి ఉంది. నా బండిలో నేను పోతాను- ఊరికే అడిగాను" చెప్పాడు నొచ్చుకుంటూ.

" మైండ్ యువర్ బిజినెస్! ఇప్పటికే పిల్లల ముందు నా పరువు తీశారు. గెట్‌లాస్ట్" అంటూ జనంలో కల్సిపోయింది.

కొన్ని రోజుల తర్వాత.

ఒక రోజు బ్యాంకులో పనిచేసుకుంటూ ఉండగా ఓ ముసిలాయనతో రాధ కనిపించింది. గోపీ వెంటనే ఆమె దగ్గరికి వచ్చి అడిగాడు.

" నేను మీకేం సహాయం చెయ్యగలను-" గోపి ఎయిర్ ఇండియా లోగో ఫోజు యిచ్చాడు.

" వీరి పెన్షను యిప్పించండి. క్యూ పెద్దగా ఉంది!" చెప్పింది రాధ.

" ఓ.కే!" అంటూ విత్‌డ్రాయల్ స్లిప్పు, పాసుబుక్కు తీసుకుని డబ్బులు డ్రా చేసి తెచ్చి ఇచ్చాడు, ఓ అయిదు నిమిషాల్లో. వాళ్ళను సాగనంపడానికి బయటకు వచ్చాడు గోపి.

" చాలా థ్యాంక్సు బాబూ!" ఆయన చెప్పాడు.

" రాధ నీ గురించి చెప్పింది!"

" దీంలో థ్యాంక్సు ఎందుకండి - ఇటీజ్ మై డ్యూటీ ! రాధ మీ కూతురా!"

" ఆ ! చివరి అమ్మాయి -" చెప్పాడు ఆయన.

" రాధగారు ! అప్పుడప్పుడు వస్తూ ఉండండి" గోపి చెప్పాడు.

" బాబూ ! నీ భార్య పిల్లలు చల్లగా ఉండాలి!" దీవించాడు.

" అయ్యో ! నా కింకా పెళ్ళికాలేదు సార్!" చెప్పాడు దీనంగా.

" అరే ! నువ్వేం మనిషివయ్యా ! నీ కిద్దరు పెద్ద పిల్లలుండి, ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ కూడ అయిపోయిందనుకున్నా!" నవ్వాడు ఆయన.

" నా గ్లామరు అటువంటింది ఏం చేస్తాం - చూసేవాళ్ళు లేరు. మీ లాంటి ఆడపిల్ల తల్లిదండ్రులు తలచుకుంటే అవుతుంది." గోపి.

" నాన్నా ! మనకు చాలా పనులున్నాయి -" రాధ హెచ్చరించింది.

" సారీ ! నాకు రాధలాంటి అమ్మాయి దొరికినా చాలు - కానీ కట్నం ఆశించకుండా పెళ్ళి చేసుకుంటాను" చెప్పాడు ధైర్యం చేసి.

రాధ చురుగ్గా అతని కళ్ళల్లోకి చూసింది.

ముసలాయన ఆగాడు - అతని వంక ఎగాదిగా చూశాడు. " బాబు - రాధలాంటి ఎందుకు గాని - నీ కిష్టమయితే రాధనే యిచ్చి చేస్తాను- చేసుకుంటావా?" సూటిగా అడిగాడు.

" నాన్నా ! " కోపంగా అంది రాధ తల తిప్పుకుంటూ.

" హు ! ఊరుకో - నా మీద గౌరవం ఉంటే !" వార్నింగు యిచ్చాడు.

" అంతకంటే అదృష్టమా - తప్పకుండా !" ఆనందంగా చెప్పాడు గోపి మెలికలు తిరిగిపోతూ. దేవత అడక్కుండా వరం యిచ్చినట్లయింది.

" ఆమె గురించి ఏం తెలుసునని చేసుకుందామనుకుంటున్నావు?" ఆశ్చర్యంగా అడిగాడు ముసిలాయన.

" ఇలా దార్నపోయే దానయ్యలను చేసుకోవాలా?" రాధ కోపం.

" నేనేం దార్ని పోవడం లేదు. బ్యాంకులో ఉన్నాను రాధా!" అంటూ తన కులం, గోత్రం, తల్లిదండ్రుల పేర్లు వగైరా చెప్పాడు.

అంతా విని ముసలాయన నిట్టూర్చాడు.

" అంతా బాగుంది కాని రాధ గురించి ఒక్కటి చెప్పాలి."

" వంద చెప్పండి - వింటాను" ఉబ్బితబ్బిబ్బయిపోతూ చెప్పాడు.

" రాధకు ముగ్గురు పిల్లలు" చెప్పాడు ముసిలాయన.

గోపీ బిత్తరపోయాడు. తల తిరిగిపోయింది.

" రాధకు పెళ్ళయిందా ?" నిర్ఘాంతపోయి అడిగాడు.

" పెళ్ళికాకుండా పిల్లలు ఎలా పుడతారు మిస్టర్!" రాధ అడిగింది.

" మీ ఆయన ఎక్కడ?" గొంతు తడారిపోతుంటే అడిగాడు.

" బాబు! అమెరికాలో అల్లుడున్నాడు - ఇంక రాడు. అతనితో తెగతెంపులు అయిపోయాయి" చెప్పాడు ఆయన విచారంగా.

" అరే ! మెళ్ళో మంగళసూత్రం లేకపోతేను, కాలికి మట్టెలు లేకపోతేను పెళ్ళి కాలేదనుకున్నాను" గోపీ ఏడ్పుగొంతుతో చెప్పాడు.

" ఇప్పుడు రాధను చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నావా గోపీ !" అడిగాడు ఆయన తాడో పేడో తేల్చుకుందామని.

" కొంచెం మా ప్యారెంట్సుని అడిగి చెబుతాను" తల వంచుకుని చెప్పాడు గోపి, గొంతులో పచ్చి వెలక్కాయ అడ్డుపడినట్లయి.

" ఫర్వాలేదు - బాగా ఆలోచించుకుని - అడిగి చెప్పండి !" రాధ తిరస్కారంగా చూస్తూ వెళ్ళిపోయింది తండ్రిని తీసుకుని.

అతని కళ్ళముందు దేవత అదృశ్యమైపోయింది....

- సుమధుర హాస్య సంచిక 2008


జనాభా లెక్కలండీ! మాకు ఇద్దరు పిల్లలు సరే... మా భార్యకు ఎంతమంది పిల్లలు!?
ఏవిఎమ్.


నేను దోచుకున్నది బ్యాంకు మేనేజరు ఇల్లంట! అన్నీ దొంగ నోట్లే!!
ఏవిఎమ్.


వారి పక్కన లవరుంది!!
నా పక్కన నా బాయ్‌ఫ్రెండున్నాడు!


స్నానానికి నీళ్ళు లేవన్నావుగా! సెంటుర్లోకి వెళ్ళి
మూర్ఛవచ్చినట్లు నటించా! ఈరోజుకి
స్నానం అయింది!
ఏవిఎమ్


ఇంట్లో చుక్క నీరు లేదు యస్సయి గారూ!
అందువల్లే దొరికాడు, ఈ అంతర్ రాష్ట్ర
ముఠా దొంగ!!
ఏవిఎమ్.


అమ్మి తెలంగాణాలో పుట్టి, సీమలో
పెరిగి, ఆంధ్రాకి వచ్చింది! అందుకే
బిడ్డా! ఆ ఏడుమొహాం.. పెడ మొహాం!
AVM


మామ్మా! నువ్వు గుడికి వెళ్ళే టైమైంది! నువ్వు త్వరగా వెళ్తే...
నేనూ, అమ్మా టిఫిన్ చేసుకుని తింటాము!
ఏవిఎమ్


ఇంజెక్షన్ చేసే సమయానికి రోజూ ఇలానే చెయ్యాలండీ!!
AVM


లక్కీగా ఈ ఆశ్రమంలో చేరబట్టిగాని! లేకపోతే! తిండికి, బట్టకి చచ్చే వాళ్ళం!!
సద్గురు
ఆశ్రమం
AVM